భావనారాయణస్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు - 5లో
ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష
శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు - 5లో

ఏళ్లు గడుస్తున్నా.. ఎడతెగని జాప్యం



కాకినాడ రూరల్ మండలం చీడిగలో అసంపూర్తిగా నిలిచిపోయిన వెహికల్ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు

- నిర్మాణంలో నాణ్యత లేమితో కిందకు దిగిన అప్రోచ్ రోడ్డు
- నత్తనడకన బ్రిడ్జి, అప్రోచ్ నిర్మాణ పనులు
- పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 10: కాకినాడ బైపాస్ రోడ్డు.. తిమ్మాపురం నుంచి గురజనాపల్లి వరకు 19.225 కిలోమీటర్లు. బైపాస్ నిర్మాణ పనులు ప్రారంభించి ఎనిమిదేళ్లు దాటింది. అసలే పనుల ప్రారంభం, భూసేకరణ, ఎలైన్‌మెంట్‌లో జాప్యానికి తోడు, నిర్మాణంలో లోపాలతో ఓ బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు కిందకు దిగిపోవడం వంటి కారణాలతో రెండున్నరేళ్లుగా బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, వంతెన, అప్రోచ్ నిర్మాణ సమయంలో భూపరీక్షలు సక్రమంగా చేయకపోవడం వంటి కారణాలతో నిర్మాణ లోపాలతో బైపాస్ రోడ్డు నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. రోడ్డు పూర్తయిన అచ్చంపేట, కొవ్వూరు తదితర చోట్ల నిర్మించిన రోడ్డు మధ్యన పగుళ్లు, రంధ్రాలు రావడంతో వీటి లోపాలను నివారించేందుకు సిమెంట్, తారు వేయడం లాంటి మరమ్మతులు చేపట్టి దిద్దుబాటు చర్యలు తీసుకున్నారు. బైపాస్ రోడ్డు అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి చేసి సత్వరంగా ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ 216 అధికారులను ప్రయాణీకులు కోరుతున్నారు.

ఏడేళ్లుగా కొనసాగుతున్న.. బైపాస్ రోడ్డు నిర్మాణం

జిల్లాలో 216 జాతీయ రహదారుల విస్తరణ, బైపాస్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన భూమిని రైతులనుంచి ప్రభుత్వం సేకరించింది. శంఖవరంనుంచి గుడిమెళ్లంక వరకు 127కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ, బైపాస్, కత్తిపూడి-తిమ్మాపురం మధ్య 27 కిలోమీటర్లు మేర బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. తిమ్మాపురంనుంచి గురజనాపల్లి వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులను 2015-16లో చేపట్టారు. తూరంగి నుంచి బోడసకుర్రు, జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టారు. జిల్లాలో పలు ప్యాకేజీల్లో నిర్మాణం చేపట్టిన రహదారుల విస్తరణ, రోడ్ల నిర్మాణం పనులు పూర్తయి వినియోగంలోకి వచ్చినా కాకినాడ బైపాస్ రోడ్డు నిర్మాణం మాత్రం వినియోగంలోకి రాలేదు. జాతీయ రహదారుల అధికారుల ఉదాశీన వైఖరి, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. దీనికితోడు పలుచోట్ల నిర్మించిన వేహికల్ అండర్ పాస్‌బ్రిడ్జిలకు అనుసంధానంగా నిర్మించిన గోడలు నాణ్యత లేమితో కిందకు కుంగిపోయి కూలిపోవడంతో నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న నాణ్యత, డొల్లతనం బయటపడింది. చీడిగ, అచ్చంపేటలో వీయూపీలు గోడలు కుంగిపోవడం, కూలిపోయి రెండున్నరేళ్లు దాటుతున్నా నేటికీ వీటి పునర్నిర్మాణంకోసం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతాలేమితో చీడిగ, అచ్చంపేటలో నిర్మించిన వెహికల్ అండర్ పాస్(వీయూపీ)ల బలోపేతానికి నిర్మించిన గోడలు పగుళ్ల వచ్చి కుంగిపోవడంతో బైపాస్ రోడ్డుకు అనుసంధానం చేసే అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినా, అవి నత్తనడకన సాగడంతో ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నచందంగా నిర్మాణపనులు ఉన్నాయి.

ఎడతెగని జాప్యం

తిమ్మాపురంనుంచి గురజనాపల్లి మధ్యలో ఉన్న 19.225 కిలోమీటర్లమేర రోడ్డు పొడవునా రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు(ఆర్‌వోబీ)లు, 3వెహికల్ అండర్‌పాస్ (వీయుపీ) వంతెనలు నిర్మించారు. వీటిలో సామర్లకోట రోడ్డులో మాధవపట్నం దాటిన తర్వాత నిర్మించి ఆర్‌వోబీ, చీడిగ వద్ద వీయూపీ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయినా అప్రోచ్ రోడ్డు నిర్మించడంలో తీవ్ర జాప్యం నేటికీ చోటుచేసుకుంది. చీడిగలో బ్రిడ్జి నిర్మాణం పూర్తయి అప్రోచ్ పూర్తయింది. మట్టి నమూనా పరీక్షల నిర్వహణలో అధికారుల ఉదాశీన వైఖరి కారణంగా అప్రోచ్ కిందకు కుంగిపోవడంతో మొత్తం అప్రోచ్ రోడ్డును ఎన్‌హెచ్ అథారిటీ అధికారులు తొలగింపచేశారు. మాధవపట్నం సమీపంలో అప్రోచ్ రోడ్డు పనుల ప్రారంభంలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. అధికారులు, కాంట్రాక్టర్, రైల్వేశాఖ తదితర ప్రభుత్వశాఖల అధికారుల మధ్య సమన్వయ లేమితో జాప్యం చోటుచేసుకుంది. ప్రయాణికుల ఇక్కట్లను దృష్టిలో ఉంచుకుని సత్వరంగా అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి చేసి తిమ్మాపురం-గురజనాపల్లి బైపాస్ రోడ్డును వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సత్వర చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



త్వరలో పవన్ రాక

- జనసేనాని ఉభయ గోదావరి జిల్లాల పర్యటన ఖరారు
- ఈనెల 14 నుంచి 17 వరకు పర్యటన
- టీడీపీ నేతలతోను సమావేశమయ్యే అవకాశం
- కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంల్లో మూడురోజులపాటు ఉండేలా ప్రణాళిక

- 5లో

నేడు దళిత సింహగర్జన సభ

- వేమగిరిలో ఏర్పాట్ల పరిశీలనలో మాజీ ఎంపీ హర్షకుమార్

- 5లో

ధర పెరిగినా.. సంతోషమేది?



- టన్నుకు రూ.70 పెరిగిన పామాయిల్
- రూ.23,500 నుంచి అంచెలంచెలుగా రూ.12,310కి తగ్గిన వైనం
- నష్టాలు వస్తున్నాయంటున్న పామాయిల్ రైతులు

గండేపల్లి, ఫిబ్రవరి10: ఆయిల్‌పాం ధర టన్నుకు రూ.70 పెరిగింది. పెరిగిన ధరను రైతులు రూ.70కు గిట్టుబాటు ధర అవుతుందా అని, పెంచిన ధర ఏడ్చిన వారి కళ్లు తుడిసినట్లు ఉందని రైతులు అంటున్నారు. రెండేళ్లుగా తాము నష్టాలు ఎదుర్కొంటున్నామన్నారు. 2022, నవంబరు, డిసెంబరుల్లో టన్ను రూ.23,550 ధర ఇచ్చి అప్పటినుంచి దఫదఫాలుగా తగ్గించుకుంటూ వచ్చి రూ.12,340కి చేర్చారని, ఇప్పుడు రూ.70 ధర రూ.12,410 చేశారని, అయినా సరే తమకు ఉపయోగం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం ఆయిల్‌పాం పంట ఆశాజనకంగా ఉంటే 8నుంచి 10టన్నులు వస్తుంది. కానీ ఈ సంవత్సరం పంటకు బూజు తెగులు పట్టి ఆకుల్లో ఉన్న తేమ పీల్చేయడంతో 5 నుంచి 6 టన్నులు వచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. ఇటు ధర లేదు. అటు దిగుబడి లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం మొక్కతోటకు హెక్టారుకు రూ.25వేలు, 90 శాతం రాయితీతో డ్రిప్‌లైన్‌లు ఇచ్చేవని, నాలుగేళ్లుగా రాయితీలు రావడం లేదని రైతులు అంటున్నారు. ఎరువులు, లేబర్ కూలిరేట్లు పెరిగిపోవడంతో ఎకరానికి రూ.50వేలనుంచి రూ.55వేలు పెట్టుబడి అవుతుందని, వచ్చే ఆదాయం ఏమీ ఉండడం లేదని రైతులు అంటున్నారు. కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రూ.23వేలు ధర పలకడంతో అధిక ధరలకు కౌలుకు మూడు నుంచి నాలుగేళ్లు లీజుకు తీసుకున్న రైతులు ఉన్నారు. ప్రస్తుత రేటులో ఎకరానికి రూ.50వేల పైనే ఏడాదికి నష్టం రావడంతో ఏడాదిన్నరగా నష్టాలనుంచి ఎలా బయటపడాలని దిక్కులు చూస్తున్నారు. మరికొందరు కౌలు తగ్గించాలని రైతులను వేడుకుంటున్నారు. ప్రభుత్వం ఇంకా గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు. జిల్లాలో అత్యధికంగా 14వేల ఎకరాల్లో ఈ గండేపల్లి మండలంలో ఈ పామాయిల్ సాగు చేస్తున్నారు.

ఎప్పటికి పూర్తవునో?



- రత్నగిరి నూతన మెట్ల మార్గానికి అనుమతులకోసం ఎదురుచూపులు
- రూ.90లక్షలతో ప్రతిపాదనలకు పాలక మండలి గ్రీన్‌సిగ్నల్
- కమిషనర్ అనుమతి ఇస్తేనే ముందుకు..
- నిర్మాణం పూర్తయితే భక్తులకు ట్రాఫిక్, వసతి కష్టాలకు చెక్

అన్నవరం, ఫిబ్రవరి 10: సత్యదేవుడి సన్నిధికి రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతోంది. కొండదిగువ నుంచి రత్నగిరికి చేరేందుకు మొదట్లో ఘాట్‌రోడ్డు, మెట్లమార్గం ఉండగా ఈ రెండు మార్గాలు పక్కపక్కనే ఉండేవి. దీంతో భక్తులు కొండపైకి కొందరు వాహనాల్లోను మరికొందరు స్వామికి మొక్కుకుని మెట్లమార్గంలో నడిచేవారు. రానురాను వాహనాల తాకిడి పెరగడంతో ఒకేమార్గం ద్వారా వాహనాల రాకపోకలతో ఇబ్బందికర పరిస్థితులు ఉండేవి. ప్రమాదాలను నివారించేందుకు 2002లో అప్పటి ఈవో ఎంవీ శేషగిరిబాబు నూతనంగా ఘాట్‌రోడ్డును ప్రతిపాదించి వెళ్లేందుకు, వచ్చేందుకు వేర్వేరుగా రెండు ఘాట్‌రోడ్లు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ప్రస్తుతం ఉన్న మెట్లమార్గం ద్వారా భక్తులు వెళ్లేందుకు ఆసక్తి చూపడంలేదు. దీనికి ప్రధాన కారణం కొండదిగువన, వాహనం పార్కింగ్ నుంచి మెట్లమార్గం దగ్గరకు వెళ్లాలంటే అర కిలోమీటరు మేర నడిచి వెళ్లాల్సి రావడం, గ్రామంలో ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో భక్తులు ఆటోలు, కార్లు, దేవస్థానం బస్సుల్లో కొండపైకి చేరుకుంటున్నారు. కొండపైకి చేరుకునే ఘాట్‌రోడ్డునుంచి నూతన మెట్ల మార్గం ఏర్పాటు చేయాలని 2010లో అప్పటి ఈవోగా పనిచేసిన రామచంద్రమోహన్ ప్రతిపాదన చేశారు. ఆయన బదిలీపై వెళ్లి తర్వాత తిరిగి ఇటీవల అన్నవరం దేవస్థానం ఈవోగా బాధ్యతలు నిర్వహించడంతో అప్పటి ప్రతిపాదనను తెరమీదకు తీసుకొచ్చారు. ఈ మెట్ల మార్గం ఏర్పాటైతే భక్తులు కొండ దిగువన కళాశాల మైదానంలో వాహనాలు పార్కింగ్, అక్కడ ఏర్పాటు చేసిన షెడ్లలో స్నానాలు చేసుకుని కొండపైకి చేరుకుంటారని, భవిష్యత్‌లో భక్తుల రద్దీ మరింత పెరగనున్న నేపథ్యంలో దీని అవసరం ఉందని గుర్తించారు. వెంటనే దీనికి సంబంధించి దస్త్రాలను సిద్ధం చేసి పాలకమండలి సమావేశంలో ముందుగా రూ.90లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు అజెండా ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించి దేవదాయ కమిషనర్ అనుమతితో పనులు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఆ దస్త్రం దేవదాయ కమిషనర్ కార్యాలయంవద్ద కమిషనర్ అనుమతి కోసం ఎదురు చూస్తోంది.

నూతనంగా నిర్మించే మెట్లమార్గం ద్వారా 15 నిమిషాల్లో రత్నగిరికి చేరుకోవచ్చునని కొండపైకి వెళ్లే టోల్‌గేట్‌నుంచి సెంటినరీ కాటేజీ వద్దకు ఈ మార్గం రూపొందించనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. 464 మెట్లు వస్తున్నాయని ఈ మార్గంలో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తూ అక్కడక్కడా భక్తులు సేదతీరేందుకు మధ్యలో నాలుగుచోట్ల మండపాలు, టాయిలెట్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్వామివారి మెట్లమార్గం ద్వారా కొండపైకి చేరుకునే భక్తులకు తిరుమల మాదిరి కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించాలనే ప్రతిపాదన ఉండడంతో భక్తులు ఈ మెట్ల ద్వారా నడిచి కొండపైకి చేరుకుంటారనడంలో ఎటువంటి సందేహం లేదు. దేవదాయ కమిషనర్ అనుమతి వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతామని ఈవో రామచంద్రమోహన్ తెలిపారు.

ధర తగ్గినా..



- సొంతింటి కలకు మంచి రోజులు
- తగ్గిన సిమెంట్, ఐరన్ ధరలు
- అయినా నిర్మాణ రంగం డల్
- రియల్ ఎస్టేట్ పడిపోవడమే కారణం

పెద్దాపురం, ఫిబ్రవరి 10: ఇల్లు కట్టుకోవాలనుకునేవారికి ఇవి మంచిరోజులే.. సిమెంట్, ఐరన్ ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. నిర్మాణాలు పుంజుకోవాల్సింది పోయి రోజురోజుకూ తగ్గుతున్నాయి. దీనికి కారణం రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆశాజనకంగా లేకపోవడం, నిర్మాణ రంగంలో ఊతం లేకపోవడమే. సాధారణంగా నిర్మాణాలకు డిసెంబరు నుంచి జూన్ నెలల్లో అనుకూలంగా ఉండే కాలం. ఈ సమయంలోనే భవన నిర్మాణాలకు కీలకంగా ఉండే సిమెంట్, ఐరన్ ధరలను పెంచుతారు. కానీ నిర్మాణాలు పెద్దగా లేకపోవడంతో ధరలు పెంచితే ఉన్న కొద్దిపాటి నిర్మాణాలు కూడా ఆగిపోయి కార్మాగారాల నిర్వహణకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కంపెనీలు భావిస్తున్నాయి.

సిమెంట్ ధర దిగువకు..

గతంలో ఎన్నడూ లేనివిధంగా సిమెంట్ ధరలు దిగువకు చేరాయి. ప్రస్తుతం సిమెంట్ ధరలు రూ.270 నుంచి రూ.310 వరకూ మార్కెట్‌లో విక్రయాలు సాగుతున్నాయి. బ్రాండు, గ్రేడ్ తదితర వ్యత్యాసాలతో వీటి ధరలు నిర్ణయిస్తారు. గతేడాది నవంబర్‌లో ఈ ధరలు రూ.370 వరకూ విక్రయించారు. గతేడాది నవంబర్‌లో గరిష్ఠంగా రూ.370 విక్రయించిన ధరలు తెలంగాణ ఎన్నికల ఎఫెక్ట్‌తో కొంతమేర తగ్గగా తర్వాత నిర్మాణాలు పుంజుకుంటే ధరలు పెంచవచ్చని భావించిన కంపెనీలకు నిర్మాణ రంగం షాక్ ఇచ్చింది. దీంతో ధరలు మరింత కనిష్ఠ స్థాయి పడిపోయాయి.

ఐరెన్‌ది అదే బాట..

గతేడాదిలో టన్ను ఐరెన్ ధర గరిష్ఠంగా రూ.70వేలకుపైగా పలకగా ఈఏడాది ఆ ధరలు కనిపించడం లేదు. ప్రస్తుతం ఐరెన్ టన్ను ధర రూ.57వేల నుంచి రూ.60వేల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇదే కనిష్ఠ ధర అని నిర్ధారణకు వచ్చిన వ్యాపారులు రెండునెలల క్రితం టన్ను రూ.62వేల పలికిన సందర్భంలో టన్నుల కొద్దీ ఐరెన్ స్టాకు పెట్టిన చాలామంది టన్నుకు రూ.3వేల వరకూ చేతులు కాల్చుకున్నారు. ప్రస్తుతం కొనుగోలు చేసే సాహసం చేయడం లేదు. ఈ పరిస్థితి సామాన్యులకు కొంత ఊరటే.

ఊగిసలాడుతున్న ఇసుక ధర..

గతంలో ఇసుక ధర నిలకడగా ఉండేది. కానీ ప్రభుత్వం చేస్తున్న మార్పులతో ఇసుక ధర ఊగిసలాడుతోంది. నెలక్రితం మూడు యూనిట్ల ఇసుక లారీ రూ.12వేల వరకూ విక్రయించారు. ఇసుక ర్యాంపులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో వాటిపై ప్రభుత్వ నియంత్రణ లేక వినియోగదారులు విలవిలలాడుతున్నారు. వీటికి తోడు బాట ఛార్జీల పేరుతో కొత్త బాదుడు మొదలెట్టడం మరింత ఆందోళన చెందుతున్నారు. దీంతో ఇసుక ధరలకు నిలకడ లేదు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలి: కలెక్టర్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 10: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ, సంసిద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా శనివారం వెలగపూడినుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. దీనికి కాకినాడ కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ కృతికాశుక్లా.. ఆయా నియోజకవర్గాల ఈఆర్వోలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వివిధ అంశాల్లో ప్రాథమిక శిక్షణను అందించామన్నారు. ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయిలో శిక్షణ అందిస్తామన్నారు. జిల్లాలోని 1637 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ సమస్యాత్మకమైన ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు, కుడా వీసీ పి.కృష్ణమూర్తి, సెజ్ ఎస్డీసీ కేడీపీ రామలక్ష్మి, టీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, సీపీవో పి.త్రినాథ్, కలెక్టరేట్ డీటీ ఎం.జగన్నాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి.. రాజకీయ సమాధి కట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు

- ఐదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్న జగన్
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు

కోటనందూరు, ఫిబ్రవరి 10: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి రాజకీయ సమాధి కడితేనే పిల్లలకు భవిష్యత్ ఉంటుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. కోటనందూరు మండలం భీమవరపుకోటలో శనివారం 'మీ ఇంటికి-మీ దివ్య' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఇప్పటికే జగన్ పాలనలో అప్పుల పాలైందన్నారు. అవినీతి, అరాచక పాలనతో రాజ్యమేలవుతుందన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తల ఆస్తులను దోచుకోవడం, చంపడం పరిపాటిగా మారిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఆస్తులు ఉన్నా వైసీపీ వాళ్లు దోచుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి జాబ్ క్యాలెండర్ ఏది అని అడిగితే సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి బ్రాందీషాపులు, చేపల మార్కెట్‌లు, వలంటీర్ల ఉద్యోగాలు ఇస్తున్నామని చెప్పడం గమనార్హమన్నారు. రాష్ట్రం బ్రాందీషాపుల మీద ఆధారపడిందన్నారు. అనంతరం మాజీమంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు చట్టాలు కొత్తగా తీసుకువచ్చారన్నారు. ఇందులో రిజిస్ట్రేషన్ చట్టం, భూయాజమాన్య చట్టంతో రాష్ట్రంలో ఆస్తులన్నీ తాకట్టుమయం అవుతున్నాయన్నారు. జగన్ పాలనలో కుటుంబంలో కాపురాలు చేసే పరిస్థితి లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పెద్దలకు దోచుకోవడం పరిపాటిగా చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో తుని నియోజకవర్గ ఇన్‌చార్జ్ యనమల దివ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, పెంటకోట భాస్కరసత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు, పోల్నాటి శేషగిరిరావు, సుర్ల లోవరాజు, మెతుకూరి వెంకటేష్, డి.చిరంజీవిరాజు, అచ్యుతరామరాజు, శివబాబు, అంకంరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

త్వరలో పవన్‌కల్యాణ్ రాక

- జనసేనాని ఉభయ గోదావరి జిల్లాల పర్యటన ఖరారు
- ఈనెల 14 నుంచి 17 వరకు పర్యటన
- టీడీపీ నేతలతోను సమావేశమయ్యే అవకాశం
- కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంల్లో మూడురోజులు ఉండేలా ప్రణాళిక


సర్పవరం జంక్షన్(కాకినాడ), ఫిబ్రవరి 10: త్వరలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జిల్లాల పర్యటనకు రానున్నారు. దీనికి సంబంధించి ఉభయ గోదావరి జిల్లాల్లో ఆయన పర్యటన ఖరారైంది. ఈనెల 14వ తేదీ నుంచి 17వరకు భీమవరం, అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంల్లో పర్యటించి పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులతో భేటీ కానున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ మంగళగిరి నుంచి ఒక ప్రకటనలో వివరాలు తెలియజేశారు.

ఎన్నికలపై దిశానిర్దేశం

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గతేడాది డిసెంబర్ నెలాఖరులో నాలుగురోజులపాటు కాకినాడలో పవన్‌కల్యాణ్ పర్యటించి పార్టీ పటిష్టత, రాబోయే ఎన్నికల్లో అభ్యర్థుల పాత్ర, ప్రణాళికలపై సమాలోచనలు చేసి పార్టీ క్యాడర్‌కు ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా కాకినాడ సిటీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన పవన్‌కల్యాణ్ డివిజన్లవారీగా పార్టీ పరిస్థితి, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఇంకా మరో 25 డివిజన్లపై సమీక్ష చేయాల్సి ఉంది. ఈసారి మిగిలిపోయిన డివిజన్లలపై సమీక్ష చేపట్టనున్నారు. జనసేనకు రాజకీయంగా ఈ మూడు జిల్లాలు కీలకం కావడంతో ఇక్కడే అధిక సీట్లు కైవసం చేసుకునేందుకు పవన్ రాజకీయ సమాలోచనలు, ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి కేడర్‌ని ఎన్నికలకు సమాయత్తం చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో వైసీపీకి ఒక్కసీటు రాకుండా చేయాలనే లక్ష్యంతో పవన్ ప్రత్యేకంగా ఇక్కడ దృష్టిసారిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇరుపార్టీల మధ్య సమన్వయం

ఉభయ గోదావరి జిల్లాలో పవన్ ఈనెల 14 నుంచి 17 వరకు ఉంటుంది. ఇందులో తొలి రోజు భీమవరంలో పర్యటన ఉంటుంది. 15, 16 అమలాపురం, కాకినాడలో, 17న రాజమహేంద్రవరంలో పవన్ సమావేశాలు ఉండవచ్చునని సమాచారం. ముఖ్యంగా పవన్ పర్యటనలో జనసేన, టీడీపీ నాయకులతో సమావేశం కానున్నారు. ఇరు పార్టీ నాయకులకు, శ్రేణులకు మధ్య మంచి వాతావరణం ఏర్పాటు చేయడం, పొత్తు ఫలితాల లక్ష్యంగా భేటీలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మూడు దశల్లో పవన్ పర్యటనలు నిర్వహించాలని భావించారు. తొలి దశలో ముఖ్య నాయకులు, ప్రభావశీలురు, ముఖ్యులతో సమావేశాలు ఉంటాయి. రెండోసారి పర్యటనలో పార్టీ స్థానిక కమిటీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల



సమావేశాల్లో పాల్గొనేలా కార్యక్రమం ఏర్పాటు చేశారు. మూడోదశలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఎన్నికల ప్రచారం చేపట్టే నాటికి మూడుసార్లు ఆయా ప్రాంతాలకు వెళ్లేలా పర్యటన షెడ్యూల్ సిద్ధం చేసుకుంటున్నారు. ఉభయ గోదావరి జిల్లాల పర్యటన తర్వాత ఇతర ప్రాంతాలకు సంబంధించిన పర్యటనలను ఖరారు చేసేందుకు పార్టీ ప్రచార కమిటీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పవన్ పర్యటన ఖరారు కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కలగనుంది.

భావనారాయణస్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు

- నెలరోజుల పాటు మాఘమాస మహోత్సవాలు





భక్తుల దర్శనార్థం ఏర్పాటుచేసిన బారికేడ్లు, శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 10: ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఆదివారం నుంచి నెలరోజులపాటు జరిగే తిరునాళ్లకు అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. మాఘమాస మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగే భావనారాయణ స్వామి తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు, ఆలయ ఛైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు. మొదటి ఆదివారం, ఈనెల 18, 25, మార్చి 3, మార్చి 10వ తేదీల్లో తిరునాళ్లు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించు కుంటారని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భావనారాయణస్వామి తిరునాళ్లు జరిగే ఆదివారాల్లో ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేడు దళిత సింహగర్జన సభ

- వేమగిరిలో ఏర్పాట్ల పరిశీలనలో మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10: సుమారు 15 ఏళ్ల క్రితం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో లక్షలాది మందితో మాలల సింహగర్జన సభ నిర్వహించిన అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ దళిత వర్గాలకు జగన్ పాలనలో జరిగిన అన్యాయాన్ని వెలుగెత్తి చాటేందుకు ఈనెల 11న రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభ నిర్వహిస్తున్నారు. ఇందుకు భారీ ఏర్పాట్లుచేశారు. వేదిక, గ్యాలరీలు, సుమారు 30 వేల మంది కూర్చొనే విధంగా సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. జాతీయ రహదారి సమీపంలో వాహనాల పార్కింగ్‌కు కేటాయించారు. ఏర్పాట్లను శనివారంహర్షకుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ ఆపై దళితుల గొంతు నొక్కాడని, 27 దళిత సంక్షేమ పథకాలను రద్దుచేశారని విమర్శించారు. సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని, మెడికల్ కళాశాలలో దళితులకు కేటాయించిన సీట్లను సైతం అమ్మేసుకున్నారని ధ్వజమెత్తారు. దళిత సింహగర్జనసభకు దళితులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. గద్దం సురేష్, శెట్టిరాజా, సైరాభాను, ఎల్‌వీ ప్రతాప్, పాల్గొన్నారు.



వేమగిరిలో దళిత సింహగర్జనకు ఏర్పాటుచేసిన సభాస్థలి



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తజనం

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.15లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 10: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుజామునే స్వామివారికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మీహోమం, బాలభోగం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని ఫలపుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, కానుకలు తీర్చుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.15 లక్షలు లభించినట్టు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, కార్యనిర్వహణాధికారి, డీసీ బి.కిషోర్‌కుమార్ తెలిపారు.

బాలబాలాజీ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి



బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, ఫిబ్రవరి 10: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. భక్తులు వైనతేయ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. స్వామివారిని అర్చకులు వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో జరిగిన లక్ష్మీనారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం స్వామివారిని 3,095మంది భక్తులు దర్శించుకుని 2,268మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ జి.మాధవి తెలిపారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాలద్వారా రూ.1,99,558 ఆదాయం వచ్చినట్టు ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ధర్మకర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, ఫిబ్రవరి 10: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3,09,150 అన్నదాన విరాళాలు రూ.73,077ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,920, తులాభారం రూ.650 వెరసి రూ.3,88,797 ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

హిందూ ధర్మవ్యాప్తికి కృషిచేయాలి

- సత్యదేవుడి సన్నిధిలో గణపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ



గణపతి సచ్చిదానందకు స్వాగతం పలుకుతున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, ఫిబ్రవరి 10: హిందూధర్మ వ్యాప్తికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని మైసూరు దత్త పీఠాధిపతులు గణపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ అన్నారు. శనివారం అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామీజీకి ఆలయ ఈవో రామచంద్రమోహన్, వేదపండితులు ఆలయమర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. దైవారాధన ద్వారానే దైనందిన జీవితంలో పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సత్యదేవుడి ఆలయం ఎంతో ఖ్యాతి కలిగిందని, ఎప్పటినుంచో ఈక్షేత్రానికి రావాలని సంకల్పం ఉందని స్వామి అనుగ్రహంతో నేటికి నెరవేరిందన్నారు. స్వామీజీకి వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఏపీఈఏపీసెట్ కార్యాలయం ప్రారంభం

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 10: కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఈఏపీసెట్) 2024కు సంబంధించిన కార్యాలయాన్ని శనివారం జేఎన్టీయూకే ఉపకులపతి, ఏపీఈఏపీసెట్ ఛైర్మన్ జీవీఆర్ ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇప్పటివరకూ వరుసగా ఏడుసార్లు జేఎన్టీయూకే ఏపీఈఏపీసెట్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. త్వరలోనే ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేస్తామన్నారు. కన్వీనర్‌గా వెంకటరెడ్డిని, కోకన్వీనర్లుగా మోహన్‌రావు, నాగేశ్వరరావులను, సమన్వయకర్తలుగా సుమతి, మధు,కృష్ణభాస్కర్‌లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఏ సీహెచ్‌సాయిబాబు, డీఈ బి.బాలకృష్ణ, సీఈ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

6100 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

రాజానగరం, ఫిబ్రవరి 10: అక్రమంగా తరలిస్తున్న రూ.31,73,872 విలువగల పీడీఎస్ బియ్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్టు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. రాజానగరం మండలంలోని శ్రీరామనగర్ శివారు నుంచి వ్యాన్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంమేరకు సిబ్బందితో కాపుకాచి వాహనాన్ని పట్టుకున్నామన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 122 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 6100 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామని, వాటి విలువ సుమారు రూ.31,73,872 ఉంటుందన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు గ్రామం నుంచి గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్టు వాహన డ్రైవర్ కరణం సద్గురమూర్తి ద్వారా తమ విచారణలో తేలినట్టు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఎస్.ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో పీడీఎస్(చౌకబియ్యం) అక్రమనిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగు తుందన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి విజయభాస్కర్, రాజానగరం సీఎస్‌డీటీ ఎం.కమల్‌సుందర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఈనెల 15 వరకు కాటన్ బ్యారేజ్‌పై రాకపోకలు నిలిపివేత

- కలెక్టర్ మాధవీలత

ధవళేశ్వరం, ఫిబ్రవరి 10: కాటన్ బ్యారేజ్‌పై రహదారి మరమ్మతుల నేపథ్యంలో మరో ఐదు రోజులు రాకపోకలు నిలిపివేస్తున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈనెల 10కి పనులు పూర్తిచేసి రాకపోకలు పునరుద్ధరిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపినా పనులు పూర్తికాకపోవడం, కాంక్రీట్ క్యూరింగ్ వంటి పనులు ఉండడంతో మరో 5రోజులు ట్రాఫిక్‌ను మళ్లించాలని ఇరిగేషన్ అధికారులు కోరారు. ఈ పనుల దృష్ట్యా ఈనెల 15 వరకు బ్యారేజ్‌పై రాకపోకలు నిలిపివేస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలుపుతూ ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- ఆర్ట్స్ కళాశాలలో జీసీటీఏ అధ్యాపకుల రాష్ట్రస్థాయి సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జీసీటీఏ సంఘం రాష్ట్రస్థాయి కార్యనిర్వాహక సమావేశం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ అధ్యాపకులు కొత్తగా వస్తున్న టెక్నాలజీలను అందిపుచ్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, క్షేత్రస్థాయి పరిశోధనలకు పునరంకితం కావాలని కోరారు. జీసీటీఏ వార్షిక డైరీలను ఆవిష్కరించారు. రాష్ట్ర జీసీటీఏ కార్యదర్శి ఎం.శ్యాంబాబు మాట్లాడుతూ అధ్యాపకులకు సర్వీస్ రెగ్యులరైజేషన్ త్వరగా పూర్తిచేయాలని, సీఏఎస్ ప్రాసెస్ మొదలుపెట్టాలని ఉన్నత విద్యాశాఖను కోరుతున్నట్టు తీర్మానించినట్టు చెప్పారు. వివిధ యాప్‌లపై అధ్యాపకుల నిరసనను పైఅధికారులకు తెలియజేసి సానుకూల స్పందన రాబడతామన్నారు. జీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాఘవరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.లలితాశరణ్య, వివిధ జిల్లాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.



జీసీటీఏ వార్షిక డైరీ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

పెళ్లికార్డులు పంచడానికి వెళ్లి అనంతలోకాలకు..


- ఒంటెద్దుబండిని ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపేట, ఫిబ్రవరి 10: మేనకోడలు పెళ్లికార్డులు పంచడానికి వెళ్లి శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కొప్పిగుంట గ్రామానికి చెందిన గుబ్బల నారాయణస్వామికి ఇద్దరు కుమార్తెలు. రెండవ కుమార్తెకు వివాహం నిశ్చయం కావడంతో శనివారం తెల్లవారుజామున బావమరిది అయిన ముమ్మిడివరానికి చెందిన కొప్పిశెట్టి రామసుబ్రహ్మణ్యం(43)తో కలిసి బంధువులకు శుభలేఖలు ఇచ్చేందుకు మోటారు సైకిలుపై కాట్రేనికోన నుంచి బయల్దేరారు. రామసుబ్రహ్మణ్యం నడుపుతుండగా నారాయణస్వామి కూర్చున్నాడు. వానపల్లి సమీపంలో అడ్డుకాలువ వద్దకు వచ్చేసరికి మంచుకురవడంతో ఎదురుగా వెళ్తున్న ఒంటెద్దు బండిని గమనించకుండా నేరుగా ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడిపోయారు. నారాయణస్వామికి స్వల్ప గాయాలు కాగా రామసుబ్రహ్మణ్యానికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామసుబ్రహ్మణ్యం మృతి చెందాడు. నారాయణస్వామి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ డి.శశాంక్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మృతిచెందిన కొప్పిశెట్టి రాంబాబు

ప్రశాంతంగా నవోదయా ప్రవేశపరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెద్దాపురం, ఫిబ్రవరి 10: పెద్దాపురంలోని జవహర్ నవోదయాలో 9వ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతగా జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్షా కేంద్రాల్లో 1587 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 1070 మంది విద్యార్థులు హాజరయ్యారని, 517 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు.

యెంట్రుకోనలో అల్లుడి వీరంగం

- దాడిలో అత్తతో పాటు మరొకరికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిక్కిరెడ్డి నరేష్

అల్లవరం, ఫిబ్రవరి 10: భార్యను కాపురానికి తీసుకెళ్లేందుకు వచ్చిన అల్లుడు వీరంగం చేయడంతో అత్తతోపాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అల్లవరం మండలం యెంట్రుకోనకు చెందిన తిక్కిరెడ్డి రాజారావు మనవరాలు శిరీషను రాజమహేంద్రవరంలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న బరువు దుర్గాప్రసాద్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. శిరీషను కాపురానికి తీసుకువెళ్లే విషయమై అత్తగారి ఇంటికి వచ్చిన అల్లుడితో ఘర్షణ జరిగింది. దీంతో దుర్గాప్రసాద్ టీవీలు, సామగ్రి ధ్వంసం చేయడం మొదలెట్టాడు. అడ్డు వచ్చిన తిక్కిరెడ్డి నరేష్, అత్త చంద్రావతిలపై దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన వారిద్దరూ అల్లవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దుర్గాప్రసాద్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు అల్లవరం ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ చెప్పారు.

వివాహిత అనుమానాస్పద మృతి



చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతున్న మహిళ, ఇన్‌సెట్‌లో దుర్గాభవాని

చాగల్లు, ఫిబ్రవరి 10: చాగల్లు శివారు జగనన్న కాలనీకి సమీపంలో మహిళ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మీనా నగరానికి చెందిన దుర్గాభవాని(25)కి అదే గ్రామానికి చెందిన జాన శివరామకృష్ణతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి మూడేళ్ల అమ్మాయి, రెండేళ్ల అబ్బాయి ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో కొన్నాళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. దుర్గాభవాని పుట్టింటి వద్దనే పిల్లలతో ఉంటుంది. మూడు రోజులుగా కనిపించడం లేదని ఆమె కోసం వెతుకుతున్నారు. శనివారం జీడి మామిడి తోటలో చెట్టుకు వేలాడుతుండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ పి.నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

లారీ ఢీ కొని వృద్ధురాలి మృతి

తునిరూరల్, ఫిబ్రవరి 10: లారీ ఢీ కొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన కాకినాడజిల్లా తుని మండలం తేటగుంటలో శనివారం చోటుచేసుకుంది. ఓ షాపు వద్దకు సిమ్మెంటు లోడుతో వస్తున్న లారీ వెనుక నుంచి కొల్లి నారాయణమ్మ(60) ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై కేసు నమోదుచేసి లారీని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ బి.రమేష్‌బాబు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

తుని రూరల్, ఫిబ్రవరి 10: తుని మండలం ఎర్రకోనేరు గ్రామానికి చెందిన పప్పు త్రిమూర్తులు(32)తుని పట్టణంలో పురుగుల మందు తాగి మృతి చెందినట్టు ఎస్‌ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. త్రిమూర్తులు ఒక యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అయితే ఇరువురు మధ్య గొడవలు చోటు చేసుకోవడంతో శుక్రవారం యువతికి పురుగుల మందు తాగించి త్రిమూర్తులు తాగాడు. దీంతో ఇద్దరు అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం త్రిమూర్తులు మృతి చెందగా యువతి కోలుకుంటున్నట్లు ఎస్‌ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ

కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ గీత

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 10: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కాకినాడ ఎంపీ వంగా గీత శనివారం కలిశారు. ఉప్పాడ కొత్తపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ, డిప్లమో కోర్సులతో కాలేజీ కేంద్ర పర్యాటక విభాగం ద్వారా రూ.12కోట్లతో మంజూరై రూ.6కోట్ల పనులు పూర్తయినందున నిధులు మంజూరు చేయాలని, అన్నవరం ప్రసాద్ స్కీమ్ మొదటి విడత నిధులు మంజూరు చేయాలని ఆమె కోరారు.

'ప్రతీ పేద కుటుంబానికి సొంతిల్లు కల్పనే లక్ష్యం'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 10: ప్రతీ పేద కుటుంబానికి సొంతిల్లు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం చేపట్టిందని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. శనివారం జేఎన్‌టీయూకే ఎదురుగా గల మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని 8 వార్డులకు చెందిన 2,812 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్యలతో కలసి పంపిణీ చేశారు. ఇప్పటి వరకు రూరల్ అర్బన్ డివిజన్లలలో 5224 మందికి ఇళ్ల పట్టాలు అందించామని, రూరల్ నియోజకవర్గంలో 32 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో కుడా చైర్‌పర్సన్ ఆర్ చంద్రకళా దీప్తి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, నగర కమిషనర్ జె వెంకటరావు, ఆర్డీవో ఇట్ల కిషోర్, ఏఎంసీ చైర్మన్లు గీసాల శ్రీను, పి.వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు వడ్డి మణికుమార్, ఐ.శ్రీను పాల్గొన్నారు.

'జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధం'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 10: 2 నెలల్లో ఎన్నికలుండగా స్థలాలు చూపకుండా హడావుడిగా ఇళ్ల పట్టాలు ఇవ్వడం ఎస్సీలను దగా చేయడానికి పన్నిన కుట్రేనని, రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ఎస్సీలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు హెచ్చరించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం ఇచ్చిన ఇళ్ల పట్టాలకే ఇప్పటివరకు అనువైన స్థలాలు చూపించలేదని, మళ్లీ ఇప్పుడు స్థలాలు చూపకుండా రూరల్ 8 వార్డుల పరిధిలో 2,812 పట్టాలు పంపిణీ చేపట్టారన్నారు. ఇప్పటికీ పిఠాపురం మండలం, సామర్లకోట మండలం, ఇతర మండలాల నుంచి ఎస్సీ లబ్ధిదారులు కలెక్టరేట్‌కు వస్తూ ఇళ్ల స్థలాలు చూపాలని వాపోతున్నారన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పలివెల రవి అనంతకుమార్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సీకోటి అప్పలకొండ, ఎస్సీ సెల్ నగర ఉపాధ్యక్షుడు బంగారు సత్యనారాయణ, నాయకులు వల్లూరి రవి, పుష్కర లెహెరియా, వానపల్లి పోలీసు పాల్గొన్నారు.

'బీసీలకు సీట్లు కేటాయించాలి'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 10: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని, లేదంటే రాబోయే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని బీసీ కులాల ఐక్యపోరాట వేదిక నాయకులు స్పష్టం చేశారు. శనివారం రమణయ్యపేట శ్రీకన్వెన్షన్ హాల్లో బీసీ కులాల ఐక్యవేదిక పోరాట వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు చొల్లంగి వేణుగోపాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బీసీ కులాలను చిన్నచూపు చూస్తున్నాయని, కాకినాడ పార్లమెంట్ పరిధిలో సుమారు 10 లక్షల ఓట్లు కలిగిన బీసీ కులాలకు తగినంత ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో సంఖ్యాపరంగా సీట్లు కేటాయించని రాజకీయ పార్టీలను ఓడించి బుద్ధి చెబుతున్నామన్నారు. జడ్పీటీసీ జీతులసీకుమార్, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఎస్ గోపాలకృష్ణ, పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, కాకరపల్లి చలపతిరావు, బొజ్జ భవాని, కర్రి గోపాలకృష్ణ, రాయుడు నాగేశ్వరరావు ఉన్నారు.

'రైతు కూలీల సమస్యలను పరిష్కరించాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 10: వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మికుల సంఘం, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్తిపాడులో ప్రదర్శన నిర్వహించారు. నాయకత్వం వహించిన గ్రామీణ కార్మిక సంఘం నాయకులు మానుకొండ లచ్చబాబు, రేచుకట్ల సింహాచలం, జె.జనార్దన్ మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ కింద నిధులు కేంద్రప్రభుత్వం తగ్గించివేస్తుందన్నారు. ఈ పథకంలో పని చేసే కూలీలకు కనీస పని దినాలు కూడా తగ్గిపోయానని కేంద్రం ఉపాధి పనులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 15న జాతీయ గ్రామీణ కార్మిక సంఘం సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సామిరెడ్డి నారాయణ మూర్తి, పేరూరి లక్ష్మి, గుంటబోయిన చక్రరావు, లక్ష్మణరావు, కాదా నాగేశ్వరరావు, నేతా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'కత్తితో దాడిచేసిన వ్యక్తులను అరెస్ట్ చేయాలి'

కొత్తపల్లి, ఫిబ్రవరి 10: దళితులపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గుబ్బల రాజు ఆధ్వర్యంలో కొత్తపల్లి సెజ్‌పునరావాస కాలనీ ప్రజలు శనివారం పోలీసుస్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. గుబ్బల రాజు మాట్లాడుతూ ఈనెల 6న మూలపేట సెజ్‌పునరావాసకాలనీకి చెందిన దారా ప్రకాష్, దారా చందులపై దళితేతర కులానికి చెందిన ఆవాల మణికంఠ, ఆవాల లోవరాజు కులంపేరుతో దుర్భాషలాడుతూ చాకుతో అతి కిరాతంగా గాయపరిచారని ఆరోపించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇద్దరిని కాకినాడ జీజీహెచ్ తరలించామన్నారు. కొత్తమూలపేట మాజీ సర్పంచ్ వడ్డి నాగమణి, దడాల సుందరరావు, గెద్దం లక్ష్మమ్మ, ఎస్.రాజేశ్వరరావు, సీహెచ్.రాంబాబు, డీవీ కుమార్, ఎం.కుమార్, పి.నాగభూషణం, బీవీ.రమణ,ఎస్.తాతారావు పాల్గొన్నారు.

'రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు'

పిఠాపురం, ఫిబ్రవరి 10: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. పిఠాపురంలో చర్చి సెంటర్ నుంచి మార్కెట్, కోటగుమ్మం సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకూ కాలినడకన పర్యటించారు. రోడ్లు మీదకు వచ్చి వ్యాపారాలు సాగిస్తున్న తోపుడుబండ్లు, ఇతర వర్తకులను వెనక్కి వెళ్లాలని సూచించారు. వాహనాల రాకపోకలు, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యాపారాలు నిర్వహిస్తే ఇబ్బందులు తప్పవని స్పష్టం చేశారు. పట్టణ ఎస్ఐ మురళీమోహన్ తదితరులు ఉన్నారు.

పిఠాపురంలో ఉద్యోగ మేళా

పిఠాపురం, జనవరి 10: పట్టణంలో శనివారం జనసేన పార్టీ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగమేళాకు భారీ స్పందన లభించింది. దేశ, విదేశాలకు చెందిన 55 మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొనగా 3వేల మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. వారిలో 586మందికి నియమాక ఉత్తర్వులు అందజేశారు. ఉదయశ్రీనివాస్, జనసేన ఎన్నారై విభాగం కన్వీనర్ కొలికొండ శశిధర్ యాదవ్ పర్యవేక్షణలోజరిగిన ఈ మేళాలో ఆస్ట్రేలియా ఎమ్ఎన్‌సీ కంపెనీ ప్రతినిధి సిడ్నీ బోర్గ్, లోకల్ సీఈవో సుకన్య కంభంపాటి, అర్సెన్సిస్ కంపెనీ ప్రతినిధులు, ఇ-ఎంసీ2 బ్రాండ్ సంస్థ ప్రతినిధులు, జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

'శ్రీప్రకాష్'లో ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్ష

పెద్దాపురం, ఫిబ్రవరి 10: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షను శనివారం నిర్వహించామని పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. కాకినాడ ఎనిమిదవ బెటాలియన్ కల్నల్ వివేక్ సావన్ గురుధర్, సుబేదార్ మేజర్ హేమంత్ కుమార్, హవాల్దార్ రఫీజైన్ కేమ్ రాజ్‌తాపా ఆధ్వర్యంలో పరీక్షను నిర్వహించడం జరిగిందన్నారు. పెద్దాపురం, ప్రత్తిపాడు, హంసవరం, తదితర పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ సవ్యసాచీ దాస్ పరీక్ష రాసిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఆకడమిక్, కల్చరల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో బూట్ క్యాంప్

గండేపల్లి, ఫిబ్రవరి 10: సూరంపాలెంలోని ఆదిత్య గ్రూపు ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం నందు ఎంబెడెడ్ సిస్టం అనే కోర్సుకు బూట్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెంది అర్టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సంస్థకు చెందిన కాకి ఆదిత్య హాజరయ్యాయని చెప్పారు. డీన్, ప్రొఫెసర్ డాక్టర్ జి.సురేష్, డీన్, అసోసియేట్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ ఎన్ రాధ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్ణవిష్ణువర్ధన్ రెడ్డి, టి.రవీంద్ర పాల్గొన్నారు.

బాలకాండపై పోటీ పరీక్షలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 10: ప్రత్తిపాడు నరేంద్రగిరి కొండ వద్ద సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో వాల్మీకి రామాయణంలోని బాలకాండపై పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు శ్రీమద్ రామాయణ పీఠం అధ్యక్షుడు గళ్ళ సుబ్బారావు చెప్పారు. శ్రీమద్ రామాయణం 5వ వార్షికోత్సవం సందర్భంగా 10-16 ఏళ్ల బాలబాలికలకు ఈనెల 18న మధ్యాహ్నం 2గంటలకు పోటీ పరీక్షలు జరుగుతాయన్నారు. అదే రోజు ఉదయం శ్రీరామ భక్తి గీతాల పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. పాల్గొనేవారు ఈ నెల 14లోగా 9951959652కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

బోటు యజమానికి రూ.25లక్షలు మంజూరు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 10: గతేడాది డిసెంబర్ ఒకటిన చేటల వేటకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో భైరవపాలెం వద్ద ప్రమాదవశాత్తూ బోటు దగ్ధమై సముద్రంలో మునిగిపోయిన ఘటనలో బోటు యాజమానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.25 లక్షల ఆర్థికసాయం అందించారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ కృతికాశుక్లా, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ నుంచి బోటు యజమాని కాటాడి రామకృష్ణ పరమహంసకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

డయల్ యువర్ డీఎం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 10: ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పిఠాపురానికి చెందిన నక్కా సూర్యనారాయణ ఏలేశ్వరం నుంచి దివిలి, విరవ, విరవాడ మీదుగా పిఠాపురానికి బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ములగపూడికి చెందిన అంకంరెడ్డి అచ్చియ్య పాత్రుడు ఏలేశ్వరం నుంచి ప్రత్తిపాడు, కత్తిపూడి, శంఖవరం, రౌతులపూడి మీదుగా ములగపూడికి బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని మేనేజర్‌ను కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

సాదరంగా ఆహ్వానించిన ముఖ్యనేతలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 10: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా విమర్శించారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏలేశ్వరం 18వ వార్డులో ఆమె మేనిఫెస్టో కరపత్రాలు పంచారు. 18వ వార్డు కౌన్సిలర్ యండ గొండి నాగబాబు ఆధ్వర్యంలో 80 కుటుంబాలకు వైసీపీకి కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. తుమ్ము సత్యవతి, యర్రంశెట్టి మంగ, ముత్యాల లోవమ్మ, వరలక్ష్మి, కోనం పండు, యర్రంశెట్టి రమేష్, కారూరి చిన్న తదితరులకు పార్టీ కండువాలు కప్పి సత్యప్రభ సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, సూది బూరయ్య, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణ స్వామి చిక్కాల లక్ష్మణరావు, వైభోగుల సుబ్బారావు, బస్వా ప్రసాద్, కౌన్సెలర్లు కోనాల వెంకటరమణ,పెంద్ర శ్రీను పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని రాజవరం పంచాయతీ శివారు గ్రామం దిప్పాలెం, పారుపాక గ్రామాలకు చెందిన 100 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. దిప్పాలెంలో చింతకాయల రాజు అధ్వర్యంలో ఉప సర్పంచ్ సియ్యాదుల ఎర్రాపాత్రుడుతో పాటు 50 కుటుంబాలు, పారుపాకలో కోసూరి శ్రీనివాస వర్మ, తిరుమల దొర అధ్వర్యంలో ఉపసర్పంచ్ కాళ్ల మంగతో పాటు ఐదుగురు వార్డు మెంబర్‌లతో సహా 50 కుటుంబాలు టీడీపీలో చేరగా ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి,


రౌతులపూడి: టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు


కోటనందూరు: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నేతలు

టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మండల మహిళా అధ్యక్షురాలు లాలం కృష్ణవేణి, మాజీ సర్పంచ్ చింతకాయల రాజు, పల్లికుమార్, వెన్నా ఈశ్వరుడు, ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, సర్పంచ్ నందమూరి రాజా, పల్లా సూరిబాబు పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని బీమవరపుకోటకి చెందిన మాజీ జడ్పీటీసీ పెంటకోట భాస్కరసత్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్న పాత్రుడు, దాడి వీరభద్రరావు సమక్షంలో వైసీపీ నాయకులు మేడపురెడ్డి జోగిబాబు, వత్సవాయి అచ్చుతరామరాజు చిటికెఅప్పలనాయుడు, దేనిటీపృధ్వీ, ఏత్సం మల్లిబాబు, వానిశెట్టి వీరబాబుతో పాటు 150మందికి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యనమల దివ్య, యనమల కృష్ణుడు, పోల్నాటి శేషగిరిరావు, సుర్ల లోవరాజు, గాడి రాజుబాబు, అంకం రెడ్డి రమేష్, పోతల సూరిబాబు, షేక్ నవాబ్‌జానీ,జనసేన నేత పి.శ్రీనివాస్, బంటుపల్లి వెంకటేశ్వర్లు మా తిరెడ్డిబాబులు, లెక్కల భాస్కర్, యర్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట పద్మనాభనగర్‌లో క్లస్టర్ ఇన్‌చార్జి జీను మణిబాబు ఆధ్వర్యంలో మాజీ వార్డు సభ్యులు జనపరెడ్డి విష్ణు, రేల్లి రామకృష్ణ, ఆనంద దేవర శ్రీను, దామీరు రాంబాబు, గోపు కృష్ణ, బ్రహ్మాచారి టీడీపీ కార్యకర్త కొప్పు శ్రీను ఆధ్వర్యంలో 10 కుటుంబాలు కలిపి మొత్తం 50 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జీను మణిబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, చదరం చంటిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, కందుల చిట్టిబాబు, పాండ్రంగి రాంబాబు, అడబాల వెంకటేశ్వరరావు, వీరంరెడ్డికాశిబాబు, సుంకవిల్లి రాజు, కందుల బాబ్జి, పైడిపాల సూరిబాబు పాల్గొన్నారు. ఇర్రిపాక శివాలయం వద్ద గోకవరం మండలం తిరుమలయ పాలెం గ్రామపంచాయతీ 8వ వార్డు మెంబర్, వైసీపీ నేత గరగ వెంకటేశులు (బుజ్జి) వైసీపీకి రాజీనామా చేసి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో తిరుమలాయపాలెం సర్పంచ్ పురంశెట్టి శివాజీ, ఉండమట్ల దొరబాబు, కురుమళ్ళ నాగేశ్వరరావు, బోనం వెంకటేశులు, వాకాడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనను అంతమొందించేందుకే లోకేశ్ 'శంఖారావం'

జయప్రదం చేయాలని కోరిన టీడీపీ నేతలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఐదేళ్లుగా పట్టిపీడిస్తున్న జగన్‌రెడ్డి రాక్షస పాలనను అంతమొందించేందుకే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తలపెట్టిన శంఖారావం కార్యక్రమం విజయవంతానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలంతా సంసిద్ధం కావాలని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఉన్న అన్ని వనరులను దోచుకుని, అన్ని రంగాల వారికి అన్యాయం చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత జగన్‌రెడ్డి, అతడి బృందానికి మాత్రమే దక్కుతుందన్నారు. సీఎం జగన్‌రెడ్డి సాగిస్తున్న అరాచక పాలనపై నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావం కార్యక్రమం అని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ సిటీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. నేడు శంఖారావం ద్వారా నియోజకవర్గాల్లో పర్యటించి జగన్ ప్రభుత్వ దౌర్జన్యాలను నిలదీస్తూ రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించనున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ పథకాల ప్రచారానికి విశ్వవిద్యాలయాలను వదలిపెట్టడం లేదని, కాకినాడలోని జేఎన్టీయూకేలో విద్యార్థులు బయటకు పోకుండా ఆడిటోరియానికి తాళాలు వేసి వైసీపీ పథకాలపై సెమినార్ నిర్వహించడం సిగ్గుచేటని ఖండించారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ పాల్గొన్నారు.


గొల్లప్రోలు రూరల్: ఏకేమల్లవరంలో రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు రూరల్: సీఎం జగన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేఖంగా నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరంలో శనివారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శంఖారావంలో భాగంగా లోకేశ్ 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారని తెలిపారు. వైసీపీ నేతల అవినీతి, అన్యాయానికి వ్యతిరేకంగా లోకేష్ యువగళం పేరుతో 220 రోజులు 3132 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారని చెప్పారు. టీడీపీ మండల, గ్రామ అధ్యక్షులు ఉలవకాయల దేవేంద్రుడు, పాలపర్తి వీర్రాజు, గనసాల నాగరాజు, మల్లిబాబు, కడిమిశెట్టి భాస్కరరెడ్డి, మడికి ప్రసాద్, మల్లిపూడి వీరబాబు, రెడ్డెం భాస్కరరావు ఉన్నారు.

జగ్గంపేట: త్వరలో నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శంఖారావం ద్వారా లోకేశ్ రోజుకు 3 నియోజకవర్గాలు పర్యటించి కొన్ని గ్రామాలను లోకేష్ సందర్శిస్తారన్నారని తెలిపారు. శంఖారావడంతో టీడీపీ కార్యకర్తల కదలికలతో జగన్మోహన్ రెడ్డికి తిరోగమనం కనిపిస్తుందన్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఒకటిగా శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విలువల పరిరక్షణలో ఆధ్యాత్మికతత్వం కీలకపాత్ర

పిఠాపురం, ఫిబ్రవరి 10: మానవతా విలువల పరిరక్షణలో ఆధ్యాత్మికతత్వం కీలకపాత్ర పోషిస్తుందని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. పిఠాపురం శివారులోని నూతన ఆశ్రమ ప్రాంగణంలో జరుగుతున్న పీఠవ వార్షిక మహాసభల రెండో రోజు శనివారం భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. తాత్విక ఆలోచనలు మనస్సుని నియంత్రిస్తాయని చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ ఈశ్వర రహస్యాన్ని అనుభవరూపంలో గ్రహింపచేసే వారే గురువు అని అన్నారు. శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మనిషిలో ఉండే మానవత్వాన్ని మేలుకొలిపి వారిని సన్మార్గంలో పయనింపచేస్తున్నారని పీఠం సేవలను ప్రశంసించారు.


తత్వమార్గం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఉమర్‌ఆలీషా, బుద్ధప్రసాద్, పీఠాధిపతులు

అఖిల బారత భవానీ దీక్షా పీఠం పీఠాధిపతి శివరామకృష్ణస్వామిజీ, ప్రణవ ఆశ్రమం పీఠాధిపతి సుమిత్రానంద సరస్వతి, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, రేకా ఉషాకిరణ్, నంద్యాల యశ్వంత్, ఎస్.ఉమేష్, డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు. సభల్లో భాగంగా తత్వమార్గం, లైఫ్ ఆఫ్ నాలెడ్జ్ గ్రంథాలను ఆవిష్కరించారు.

'పేదలకు సమగ్ర వైద్యం అందించేందుకు కృషి'

సామర్లకోట, ఫిబ్రవరి 10: పేదలకు ప్రభుత్వాసుపత్రిలో సమగ్ర వైద్యం అందించేందుకు వైద్యులు,సిబ్బంది సమష్టి కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం ఆసుపత్రి ఆవరణలో సమన్వయ కమిటీ సమావేశం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమల అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజప్ప ఆసుపత్రిలో ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు, మందుల సరఫరా, రోగులకు అందుతున్న మౌలిక సదుపాయాలపై సమగ్రంగా సమీక్షించారు. ఆసుపత్రికి జనరేటర్ అందుబాటులో ఉన్నప్పటికీ దానిని ఇన్‌స్టాల్ చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నట్లు డాక్టర్ అమల ఎమ్మెల్యేకు వివరించారు. కాగా ఆసుపత్రి స్థలం ఇటీవల ఆక్రమణలు జరగడం పట్ల అధికారులు ఏమి చేస్తున్నారు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'చరిత్రలో నిలిచిపోయే అంగన్‌వాడీల పోరాటం'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 10: అంగన్‌వాడీల 42 రోజుల పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి అన్నారు. కాకినాడ ధర్నాచౌక్ వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల అభినందనసభ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ అధ్యక్షతన శనివారం జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరుబండి చంద్రావతి మాటాడారు. అంగన్‌వాడీ యూనియన్ ప్రభుత్వం ముందుంచిన 12 డిమాండ్లలో 11 సాధించామని.. సమ్మె కాలపు వేతనాలు పూర్తిగా చెల్లించేలా, ఒకరిని ఉద్యోగం నుంచి తొలగించకుండా అంగన్‌వాడీ ఉద్యమం ఘన విజయం సాధించిందని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 10: రూరల్ మండలం కొవ్వూరుకు చెందిన ఆవుపాటి ఆచార్యులు (64) ప్రమాదవ శాత్తు గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. ఈనెల 6వతేదీ రాత్రి ఆచార్యులు గ్యాస్ స్టౌవ్ ఆన్‌చేసిన సంగతి మరచిపోయి కొంత సమయం తరువాత లైటర్‌తో వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు రావడంతో అతడి శరీరంపై గాయాలు కావడంతో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ భీష్మకుమార్ చెప్పారు.

'నిర్లక్ష్యంగా ప్రభుత్వాలు'

తుని రూరల్, ఫిబ్రవరి 10: స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్ర పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఆరోపించారు. శనివారం జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రతినిధులు బృందం సంఘం ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణమ్మ సారథ్యంలో సీతారామరాజు తపస్సు చేసిన గోపాలపట్నంలోని సీతమ్మకొండపై ఉన్న రామలింగేశ్వర ఆలయం అల్లూరి చదువుకున్న తుని రాజా హై స్కూల్‌ను సందర్శించారు. వీరభద్రరావు మాట్లాడుతూ సీతమ్మకొండపై ఉన్న రామలింగేశ్వరాలయానికి సరైన రోడ్డును నిర్మించాలన్నారు. యువజన సంఘం కార్యదర్శులు లక్కాకుల బాబ్జి, శివంగి నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

'ఉరుస్' ఏర్పాట్ల పరిశీలన

పొన్నాడ (కొత్తపల్లి), ఫిబ్రవరి 10: పొన్నాడలో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగే బంగారు ఉరుస్ ఉత్సవాలకు వచ్చే హిందూ, ముస్లిం భక్తుల కోసం చేపట్టే ఏర్పాట్లను కొత్తపల్లి పోలీసులు పరిశీలించారు. 3రోజులు వేలాదిమంది బంగారు పాపను దర్శనం చేసుకునేందుకు రానున్న దృష్ట్యా అసౌకర్యం కలుగకుండా బందోబస్తు చేపట్టనున్నట్టు సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పీవీ.స్వామినాయుడు చెప్పారు.

ఇళ్ల పట్టాల రద్దు నోటీసులపై హైకోర్టుకు లబ్ధిదారులు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 10: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో టీడీపీ హయాంలో ఇచ్చిన ఇళ్లస్థలాల పట్టాలను రద్దు చేస్తూ రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసులపై లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించారు. 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పలువురికి ఇళ్లస్థలాలు ఇచ్చారు. వాటిని రద్దు చేస్తూ గొల్లప్రోలు తహశీల్దారు ఇచ్చిన నోటీసులపై శ్రీమంతుల రాజేశ్వరి, మాసా ప్రవీణ, మడికి చినసూర్యకాంతం సహా 15మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లబ్ధిదారుల తరపు న్యాయవాది అభ్యర్థన మేరకు వారికి ఇచ్చిన నోటీసులను సస్పెండ్ చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతివాదులైన రెవెన్యూ శాఖ కార్యదర్శి, కాకినాడ కలెక్టరు, ఆర్డీవో, తహశీల్దార్లుకు నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. 3వారాలకు పిటిషన్‌ను వాయిదా వేసింది.

14న ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ

జగ్గంపేట, ఫిబ్రవరి 10: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఈనెల 14న జ్యోతిర్లింగాల ప్రతిష్ఠను నిర్వహించనున్నామని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఇర్రిపాకలో శివాలయం వద్ద శనివారం ఆయన ఆహ్వాన పత్రాలు విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 11,12,13న అతివాసం నిర్వహించి 14న ఉదయం 10.58 గంటలకు శ్రీ పీఠం పీఠాధిపతులు స్వామి పరిపూర్ణానంద స్వామి చేతులమీదుగా ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిమలు ఇర్రిపాకలో ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు. 26న ఉదయం 10.30గంటలకు మహాయజ్ఞం ప్రారంభించి 11రోజులు పాటు మహాకుంభాభిషేక సహిత రుద్ర యాగం నిర్వహించుచున్నామని, మార్చి7న ఉదయం 8.30కు మహాపూర్ణాహుతి జరుగుతుందని తెలిపారు. భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అడబాల భాస్కరరావు, పోతుల మోహన్‌రావు, చదరం చంటిబాబు, మంగ రౌతు రామకృష్ణ, సుంకవిల్లి రాజు, బదిరెడ్డి అచ్చన్న దొర, దాసరి శివరామకృష్ణ, ఎస్.బాబు, బొదిరెడ్ల సుబ్బారావు, పాల్గొన్నారు.

కోటి మట్టి శివలింగాల తయారీ

కిర్లంపూడి, ఫిబ్రవరి 10: ఇర్రిపాకలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కోటి మట్టి శివలింగాల తయారీకి మండలంలో గోనాడు గ్రామానికి చెందిన టీడీపీ నేత నీలం శ్రీను ఆధ్వర్యంలో భారీగా మహిళలు బస్సులు, ఆటోల్లో తరలివెళ్లారు. సోమవరం గ్రామానికి చెందిన జంపన రవివర్మ, బూరుగుపూడి గ్రామానికి చెందిన కుంచే తాతాజీ, తోట వెంకటేశ్వర్లు, విశ్వనాథం, మూరా సత్తిబాబు ఉన్నారు.

పాదగయ ఈవో బాధ్యతల స్వీకరణ

పిఠాపురం, ఫిబ్రవరి 10: పట్టణంలోని పాదగయ క్షేత్రంలో ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ఈవో పులి నారాయణమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ గ్రేడ్-1 ఈవో కేటగిరిలో ఉన్న కార్యనిర్వహణాధికారి పోస్టును సహాయ కమిషనరు స్థాయికి ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. దీంతో ఇప్పటి వరకూ ఈవోగా పనిచేసిన వడ్డి శ్రీనివాసరావును పెద్దాపురం మండలం దివిలి తిరుపతిలోని శృంగారవల్లభ స్వామి దేవస్థానం ఈవోగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న నారాయణమూర్తిని పదోన్నతిపై పాదగయ ఈవోగా నియమిస్తూ కమిషనరు ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణమూర్తికి పలువురు అభినందనలు తెలిపారు.

భీమేశ్వరాలయ ఈవో బదిలీ

సామర్లకోట, ఫిబ్రవరి 10: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయ ఈవోగా పనిచేస్తున్న డి.నాగమల్లేశ్వరరావు దేవాదాయ సహాయ కమిషనర్‌గా పదోన్నతిపై కోనసీమ అంబేడ్కర్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సోమవారం అమలాపురంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

'పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి'

సామర్లకోట, ఫిబ్రవరి 10: రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖ రూపొందించిన కార్యాచరణను అమలు చేయాలని విద్యాశాఖ ఆర్జేడీ జీ.నాగమణి ఆదేశించారు. మండలంలోని మాధవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన అమలుతీరును సమీక్షించేందుకు విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించారు. 8,9 తరగతుల విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా తరగతుల వారీగా విద్యార్థుల మేధస్సు ఆశించినతీరులో లేదని గుర్తించారు. విద్యార్థులు ట్యాబ్‌లు సక్రమంగా వినియోగించే బాధ్యత పూర్తిగా ఉపాధ్యాయులదేనన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎల్.గోవిందరాజులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గెలుపోటములు స్వీకరించాలి'

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 10: క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఆర్జేడీ నాగమణి అన్నారు. శనివారం భాష్యం పాఠశాలల విద్యార్థులకు డీఎస్ఏ మైదానంలో నిర్వహించిన స్పోర్ట్స్ ఈవెంట్‌ను ఆమె ప్రారంభించారు. కాకినాడ పరిధిలోని పది బ్రాంచ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్.జార్జి బహుమతులు అందజేశారు. జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో 'పల్లెకు పోదాం'

తాళ్లరేవు, ఫిబ్రవరి 10: తాళ్లరేవు బైపాస్ కాలనీలో బీజేపీ ముమ్మిడివరం నియోజకవర్గ కోకన్వీనర్ విత్తనాల కరిమిల స్వామి ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దత్తాత్రేయవర్మ, యనమండ్ర విజయకుమార్, కొప్పిశెట్టి అనంతలక్ష్మి, శ్రీనివాస వరప్రసాద్, కొప్పిశెట్టి చినరాయుడు, నిమ్మకాయల ఈశ్వరరావు తదితరులున్నారు.

వేళంగిలో...

కరప: వేళంగి గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. బీజేపీ నేత వీరప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు బీజేపీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బీజేపీ నేతలు బొండా వెంకన్న, నున్న కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్ష

తాళ్లరేవు, ఫిబ్రవరి 10: చొల్లంగి భూముల్లో పేదలకు పట్టాలు ఇవ్వాలని చేపట్టిన నిరసన దీక్ష శనివారంతో 11రోజుకు చేరుకుంది. జి.వేమవరం, పటవల గ్రామాల్లో చొల్లంగి లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేసి చొల్లంగిలోనే ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. నివాసాలకు యోగ్యంలేని ప్రాంతాల్లో పట్టాలిచ్చి ప్రభుత్వం చేతులు దులిపేసుకుందని, గ్రామం మధ్యలో ఖాళీస్థలాలను మంత్రులు, ఎమ్మెల్యేలకు కావాల్సిన వారికి ఇచ్చేస్తున్నారని ఆరోపించారు.

జిల్లా వైద్యశాఖాధికారి పూజలు

అన్నవరం, ఫిబ్రవరి 10: రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడి సన్నిధిలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరసింహనాయక్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వైద్యాధికారులు డాక్టర్ పి.రవికుమార్, భారతి, హెల్త్ అసిస్టెంట్ సత్తిబాబు ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహార కిట్లు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 10: ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం వద్ద శనివారం నిరుపేద విద్యార్థులకు సదా మీ సేవలో స్వచ్ఛంద సేవా సంస్థ పౌష్టికాహార కిట్లు పంపిణీ చేపట్టింది. షిర్డిసాయి జ్యూయలరీ అధినేత పడాల శ్రీనివాస రెడ్డి సమకూర్చిన కిట్లను ఫొటో గ్రాఫర్ సలాది కృష్ణ అందజేశారు. స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు జి.సత్యానందం, బేరి రాంబాబు, ఎస్వీ సోమేశ్వరరావు, పి.లక్ష్మి పాల్గొన్నారు.

నవోదయా పరీక్షలు

సామర్లకోట, ఫిబ్రవరి 10: జవహర్ నవోదయా విద్యాలయంలో 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు గాను ప్రస్తుతం 8వ తరగతి, 10వ తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు శనివారం సామర్లకోటలో నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఎంఈవో వై. శివరామకృష్ణయ్య మండలస్థాయి పరిశీలకుడిగా, సెంటర్‌లెవెల్ పరిశీలకుడిగా వి.జగన్ మోహనరావు వ్యవహరించారు. మొత్తం 192 మంది విద్యార్థులకు గాను 117 మంది హాజరయ్యారు.

స్పిన్నింగ్ మిల్ సందర్శన

శంఖవరం, ఫిబ్రవరి 10: రావికంపాడులోని శివరాం యార్న్ ప్రైవేట్ లిమిటెడ్‌ను శంఖవరం కస్తూర్బా విద్యార్థినులు సందర్శించారు. స్పిన్నింగ్ మిషనరీ వాటి పనితీరు, పత్తి నుంచి దారం తయారీని చూసి తెలుసుకున్నారు. స్పిన్నింగ్ మిల్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, నిపుణులు విద్యార్థులకు దారం ఎలా తయారు చేస్తారో వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, కృష్ణ వేణీ, ఎంఎస్ రత్నం పాల్గొన్నారు.

యనమల దివ్య ప్రచారం

తుని రూరల్, ఫిబ్రవరి 10: తుని 30వ వార్డులో టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య టీడీపీ నాయకులతో ఇంటింటా ప్రచారం చేపట్టారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమరాజు, దంతులూరి శ్రీనివాసరాజు, సిద్దాంతపు సత్తిబాబు, గజ్జి రాంబాబు, ఎస్.శ్రీనివాసరాజు ఉన్నారు.

జ్యోతుల నవీన్ ప్రచారం

జగ్గంపేట, ఫిబ్రవరి 10: మండలంలోని మామిడాడ గ్రామంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తన తండ్రి జ్యోతుల నెహ్రూను గెలిపించాలన్నారు. స్థానిక నాయకులు, టీడీపీ కార్యకర్తలు, అభిమానులున్నారు.

